సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
98490 98674
నంబర్‌ను సంప్రదించండి

సోలార్ వెలుగు

సౌర విద్యుత్ వైపు మొగ్గు

సబ్సిడీతో పాటు రుణసదుపాయం

ఆసక్తి చూపిస్తున్న వినియోగదారులు

మండలంలో 243 దరఖాస్తులు





పెదగంట్యాడ: పర్యావరణంపై అవగాహన పెరగడంతో ప్రజలు సోలార్ పవర్ వినియోగానికి ఆసక్తి చూపుతున్నారు. సహజ వనరులను సద్వినియోగం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకు వచ్చిన పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకానికి వినియోగదారుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో పాటు రుణ సదుపాయం కల్పిస్తుండడంతో దీనిపై ఏపీఈపీడీసీఎల్ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్‌తో నెలకు 160 యూనిట్లు, రెండు కిలో వాట్లకు 240 యూనిట్లు, మూడు కిలో వాట్లకు 360 యూనిట్లు పైగా విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని వివరిస్తున్నారు. దీని ద్వారా గణనీయంగా విద్యుత్ బిల్లు ఆదా అవుతుందని చెబుతున్నారు. దీంతో గృహ వినియోగదారులు సైతం సోలార్ ప్యానళ్ల ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు వస్తున్నారు.

పథకంలో చేరాలంటే..

ముందుగా పీఎం సూర్యఘర్ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో వివరాలు నమోదు చేయాలి. ఆర్నెల్ల కరెంటు బిల్లు కాపీలను జతపర్చాలి. ఆపై రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అందులో కిలో వాట్ ప్రకారం సబ్సిడీ అందనుంది. మిగిలిన మొత్తానికి బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కల్పించనున్నారు. వినియోగదారులు వారి తాలూకా బ్యాంక్ ఖాతా వివరాలను అప్‌లోడ్ చేయాలి. సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం 30 రోజుల్లో చెల్లించనుంది. కిలో వాట్ రూఫ్‌టాప్ కెపాసిటీ కోసం 3 నుంచి నాలుగు ప్యానెల్స్‌ను అమర్చనున్నారు. ఒక్కో కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్ ప్యానెల్ నెలకు దాదాపు 160 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేయనుందని తెలుపుతున్నారు..

రాయితీ ఇలా..

సోలార్ వ్యవస్థ ద్వారా ఉత్పత్తి అయ్యే కిలో వాట్ ప్లాంట్‌కు రూ.30వేలు, రెండు కిలో వాట్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునే వారికి రూ.60వేలు, మూడు కిలోవాట్లు ప్లాంట్ ఏర్పాటు చేసుకునే వారికి రూ.78 వేలు గరిష్ట రాయితీ అందుతుంది. ఎవరికి ఎంత కెపాసిటీ కావాలంటే నెలకు 0–150 యూనిట్లు విద్యుత్ వినియోగించే వారికి ఒకటి నుంచి రెండు కిలో వాట్లు రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవాలి. అలాగే 150 నుంచి 300 యూనిట్లు వినియోగించే వారు రెండు మూడు కిలో వాట్లు సామర్థ్యం కలిగిన ప్లాంటు ఏర్పాటు చేసుకుంటే సరిపోతుంది.

63 ఇళ్లపై ఏర్పాటు

సోలార్ రూఫ్‌టాప్ కోసం మండల పరిధిలో వికాస్‌నగర్, సమతానగర్, పెదగంట్యాడ, హౌసింగ్‌బోర్డు కాలనీ, సమతానగర్, నడుపూరు, నెల్లిముక్కు, గంగవరం తదితర ప్రాంతాలకు చెందిన 243 మంది గృహ యజమానులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ మేరకు వారి దరఖాస్తులను పరిశీలించిన ఏపీఈపీడీసీఎల్ అధికారులు సోలార్ రూఫ్‌టాప్ పనులు చేపట్టారు. ఇప్పటికి 63 మందికి సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేశారు

పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



వినియోగదారులు సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునే అద్భుతమైన పథకం పీఎం సూర్య ఘర్. సోలార్ విద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ, రుణ సదుపాయం అందిస్తోంది. వినియోగదారులు పెట్టిన పెట్టుబడి సుమారు ఏడేళ్లలో తిరిగి పొందవచ్చు. నెట్ మీటర్ విధానం ద్వారా విద్యుత్ వినియోగాన్ని తెలుసుకోవచ్చు. ఈ పథకానికి సంబంధించి సందేహాలు ఉంటే ఏపీఈపీడీసీఎల్ కార్యాలయాల్లో సంప్రదించవచ్చు. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

– రాజేంద్రప్రసాద్, ఏఈ, ఏపీఈపీడీసీఎల్, పెదగంట్యాడ

ప్రీపెయిడ్ ఆటో స్టాండ్ ప్రారంభం నేడు



ప్రీ పెయిడ్ ఆటో ట్యాక్సీ స్టాండ్


అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు ఏర్పాటు చేసిన ప్రీ పెయిడ్ ఆటో, ట్యాక్సీ స్టాండ్‌ను విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి, డీఆర్‌ఎం లలిత్ బొహ్రా మంగళవారం ప్రారంభించనున్నారు. ప్రీ పెయిడ్ ఆటో స్టాండ్ లేకపోవడంలో కొంతమంది ఆటోవాలాలు అధిక ధరలు వసూలు చేస్తున్నారని పలుమార్లు ప్రజా సంఘాల నాయకులు పోలీస్ కమిషనర్, రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు దువ్వాడ రైల్వేస్టేషన్ విస్తరణ పనులు చేపడుతున్న క్రమంలో ప్రీపెయిడ్‌ఆటో స్టాండ్‌ను ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటలకు అతిథుల చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాజువాక: చినగంట్యాడ, స్వతంత్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో 132 కేవీ లైన్ల నిర్వహణ పనుల కారణంగా మంగళవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు తెలిపారు. వందడుగుల రోడ్‌లోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు శ్రీనగర్, చినగంట్యాడ ఎస్సీ కాలనీ, స్నేహపురి కాలనీ, పాత మీసేవా కేంద్రం ఏరియాలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా గోదాదేవికి పూజలు



పూజలు అందుకున్న గోదాదేవి అమ్మవారు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం గోదాదేవికి పూజలు ఘనంగా నిర్వహించారు. గోదాదేవి జన్మ నక్షత్రం తిరునక్షత్రం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు భావనారాయణ స్వామి నేతృత్వంలో అమ్మవారికి తిరుప్పావై, సేవాకాలం, మంగళ శాసనం, తిరునక్షత్ర తనియన్లు, విన్నపం చేశారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

అగనంపూడి: విద్యార్థులు సేవా రంగంలో రాణించాలంటే సమాజం స్థితిగతులు తెలుసుకోవాల్సి ఉంటుందని విజ్ఞాన్ ఇంజనీరింగ్, విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు జె.సుధాకర్, బి.అరుంధతి అన్నారు. విద్యా సంస్థల చైర్మన్ రత్తయ్య జన్మదినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్, విమ్స్, ఎ.ఎస్.రాజా బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. రెండు కళాశాలల్లో మొత్తం 240 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదనరావు, లయన్స్ క్లబ్ ఉత్తరాంధ్ర ఉపగవర్నర్ కె.వి. సుబ్బరాజు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, క్లబ్‌జోన్ చైర్మన్ ఎ.మరళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


'సినారె' రచనలు సందేశాత్మకం



సినారె సాహిత్య సమాలోచన సదస్సులో పాల్గొన్న సాహితీవేత్తలు

సీతంపేట: జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతిని పురస్కరించుకుని విశాఖ పౌర గ్రంథాలయం ఆధ్వర్యంలో సోమవారం పబ్లిక్ లైబ్రరీలో సినారె సాహిత్య సమాలోచన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ సి.నారాయణరెడ్డి రచించిన చారిత్రక గేయ కథా కావ్యం కర్పూర వసంత రాయలులోని కథన శిల్పాన్ని శైలీ సౌకుమార్యాన్ని దేశం కోసం వ్యక్తులు త్యాగం చేయాల్సిన అవసరాన్ని సందేశాత్మకంగా వ్యక్తం చేశారని వివరించారు. కొండవీటి కుమారగిరి రెడ్డి కాలంనాటి చారిత్రక గాథను రస రమ్యంగా అక్షరీకరించారన్నారు. రాంభట్ల నృసింహ శర్మ సి.నా.రె. గీతాలు ఆలపించి, వాటి సౌందర్యాన్ని ఆవిష్కరించారు. సాహితీవేత్తలు శేఖర మంత్రి ప్రభాకర్, డాక్టర్ కె.ఎస్.ఎన్.మూర్తి, శివాజీ, రాధారాణి, నిర్మల, ఉప్పల అప్పలరాజు ప్రసంగించారు.

క్రైస్తవులపై దాడులు చేస్తే సహించం



మాట్లాడుతున్న బక్క పరంజ్యోతి

సీతంపేట: దళిత క్రైస్తవులపై దాడులు చేస్తే సహించేది లేదని ఆలిండియా బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త బక్క పరంజ్యోతి హెచ్చరించారు. దళితుల హక్కుల సాధన కోసం అక్కయ్యపాలెంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనుమతులు లేని చర్చిలపై కూటమి ప్రభుత్వం దాడులు చేయిస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత క్రైస్తవులపై ఎటువంటి నిర్ణయం తీసుకోవడం లేదన్నారు. గతంలో ఉన్న కాంగ్రెస్, ఇప్పుడు బీజేపీ ప్రభుత్వాలు ఎటువంటి సాయం చేయడం లేదని చెప్పారు. దేశంలో మతం మారడం స్వేచ్ఛతో కూడిన హక్కని, దానిని కాలరాస్తామంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. దళిత క్రైస్తవుల హక్కుల సాధనకు వివిధ రూపాల్లో పోరాడుతామని తెలిపారు.

బిందె నిండడం గగనం



నీటి సరఫరాను పరిశీలిస్తున్న ఈఈ శ్రీనివాస ప్రసాద్, కార్పొరేటర్ చందు

ఈఈ ఎదుట మహిళల ఆవేదన

గాజువాక: జీవీఎంసీ 70వ వార్డులో నీటి కష్టాలను పలువురు మహిళలు జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులకు వివరించారు. బిందెడు నీళ్ల కోసం పైపు పట్టుకొని నిలబడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి కోసం ప్రతిరోజు అవస్థలు పడుతున్నామని వాపోయారు. తమ వార్డులో నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు గత సోమవారం జీవీఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కమిషనర్ కేతన్ గార్గ్ సంబంధిత అధికారులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో వాటర్‌సప్లై ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస ప్రసాద్ 70వ వార్డులో సోమవారం నీటి సరఫరాను పరిశీలించారు. కార్పొరేటర్ చందుతో కలిసి శ్రామికనగర్, ఎంవీఆర్ కాలేజీ ఏరియా, శ్రీనివాసనగర్, చిట్టినాయుడు కాలనీ కొండవాలు ప్రాంతాల్లో పర్యటించారు. ఆ సమయంలో నీటి సరఫరాను స్వయంగా పరిశీలించారు. తమ ఇళ్లకు వచ్చిన ఈఈకి మహిళలు గోడు వివరించారు. నీటి సరఫరాలో ఇబ్బందులకు గల కారణాలను చందు ఈ సందర్భంగా ఈఈకి వివరించారు. దెబ్బతిన్న పైప్‌లైన్లను మార్చి కొత్త పైప్ లైన్ వేయాలని కోరారు. పర్యటనలో డీఈ శ్రీను, ఏఈ కేదార్‌నాథ్, స్థానిక నాయకులు పాలఘాట్ కృష్ణ, కొణతాల రాము, అచ్చిబాబు, బాబులు నాయుడు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కృషి వల్లే ప్లాంట్ పురోభివృద్ధి



పదవీ విరమణ ఉద్యోగులను సత్కరిస్తున్న రాజశేఖర్, హాజరైన నాయకులు

ఉక్కునగరం: కార్మికుల కృషి వల్లే స్టీల్‌ప్లాంట్ పురోభివృద్ధిలో నడుస్తుందని స్టీల్ ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్ అన్నారు. ఈనెలాఖరున పదవీ విరమణ చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు గంట్యాడ గురుమూర్తి, ఎం.ఎస్.ఆర్. ప్రసాద్, బి. వెంకటేశ్వరరావులను సోమవారం యూనియన్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో రాజశేఖర్ మాట్లాడుతూ యాజమాన్యం మూడు నెలల జీతం పెండింగ్‌లో పెట్టినా సక్రమంగా జీతాలు చెల్లించక పోయినా కార్మికులు అకుంఠిత దీక్షతో మూడో బ్లాస్ట్‌ఫర్నేస్ నుంచి అధిక ఉత్పత్తిని సాధిస్తున్నారన్నారు. వీఆర్‌ఎస్‌తో ఉద్యోగుల సంఖ్య తగ్గినా ఉత్పత్తి తగ్గకుండా రికార్డు ఉత్పత్తి దిశగా సాగుతుందంటే అది ఉద్యోగుల ఘనతే అన్నారు. పదవీ విరమణ చేస్తున్న నాయకుల వల్ల యూనియన్‌కు కొంత నష్టం కలుగుతున్నప్పటికీ వారు భవిష్యత్తులో కూడా యూనియన్‌కు సేవలు అందిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రమణమూర్తి, రాజు, మద్ది అప్పలరాజురెడ్డి, వెంకన్న, మొల్లి ఈశ్వరరావు, ఎస్. రమేష్‌కుమార్, చిమ్మిటి అప్పలరాజు, పెంటారావు, వెలగపూడి ఈశ్వరరావు, కుమార్, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై మరో విద్యుత్ ఉద్యమం

రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకుల పిలుపు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

గాజువాక: విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ మరో విద్యుత్ ఉద్యమం నిర్వహించాల్సిన అవసరం ఉందని వివిధ ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. గతంలో నిర్వహించిన విద్యుత్ ఉద్యమం స్ఫూర్తితో మళ్లీ ఆ స్థాయి పోరాటాన్ని నిర్వహించాలన్నారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సీఐటీయూ కార్యాలయంలో ప్రజా సంఘాలు సోమవారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల చోటు చేసుకునే నష్టాలపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయకుండా ప్రజలు అడ్డుకోవాలని కోరారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటు చేయడం దుర్మార్గమన్నారు. స్మార్ట్ మీటర్లను పగులగొట్టాలని ఎన్నికలకు ముందు టీడీపీ పిలుపునిచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తోందని అన్నారు. స్మార్ట్ మీటర్లను బిగించడానికి డబ్బులు కూడా ప్రజల నుంచే వసూలు చేస్తారన్నారు. వాటి టారిఫ్‌లు పీక్ అవర్స్‌లో ఒకలాగా, సాధారణ సమయాల్లో మరోలాగా ఉంటాయన్నారు. ఏఐటీయూసీ నాయకుడు కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే ఉపాధి పోయి ప్రజలు వీధిన పడుతుంటే మరోపక్క స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారాలు మోపడానికి చర్యలు చేపట్టడం దారుణమన్నారు. ఒక్క పైసా పెట్టుబడి లేకుండా అదానీకి మేలు చేయడానికి మోదీ ప్రభుత్వం ఇలాంటి విధానాలను తీసుకొచ్చిందన్నారు. ఈ విధానాలను వ్యతిరేకించాల్సిన రాజకీయ పార్టీలు మాట్లాడటం లేదన్నారు. సీఐటీయూ నాయకుడు ఎం.రాంబాబు మాట్లాడుతూ ఇళ్లల్లో బిగించే స్మార్ట్ మీటర్లను మొబైల్ ఫోన్ మాదిరిగా రీచార్జి చేసుకోవాలని, లేనిపక్షంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని అన్నారు. దీనివల్ల ప్రజలు చీకట్లో గడపాల్సి వస్తుందన్నారు. స్మార్ట్ మీటర్లను ఎట్టి పరిస్థితుల్లో ప్రజలు అడ్డుకొని తీరాలని కోరారు. సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు జి.లక్ష్మి, త్రినాథ్ స్వామి, జి.రాము, కె.అచ్యుతరావు, జి.ఆనంద్, పి.దుర్గారావు, డి.రమణ, ఎం.సరోజిని తదితరులు పాల్గొన్నారు.

మూణ్ణాళ్ల ముచ్చటగా మరమ్మతులు



దళ్లివానిపాలెం సచివాలయం వెనుక నూతనంగా నిర్మించిన రహదారిలో పడిన గుంతలు



ఇస్లాంపేట హాస్టల్ సమీపంలో..



కోరాడ సమీపంలో రోడ్డు మధ్యలో గుంతలు

పెదగంట్యాడ: మండలంలో చేపట్టిన రోడ్ల మరమ్మతులు మూణ్ణాళ్ల ముచ్చటగా మారాయి. చిన్నపాటి వర్షాలకే గోతులు పడి రోడ్లు అధ్వానంగా తయారవుతున్నాయి. దీంతో లక్షలాది రూపాయలు వృథాగా మారాయి. జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా ఈ పరిస్థితులు తలెత్తుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనులు చేపట్టిన సమయంలో అధికారులు పర్యవేక్షించకపోవడంతో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథాగా పోతోందని అంటున్నారు. పనులు చేపట్టిన సమయంలోనే నాణ్యతను పరిశీలిస్తే ఈ పరిస్థితి ఉండదని చెబుతున్నారు. ఇలా అయితే ఆ పనుల వల్ల కలిగే ప్రయోజనం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో చేపట్టిన చేపడుతున్న కోట్ల రూపాయల విలువైన పనులను పరిశీలించాలని కోరుతున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఆయా రోడ్లలో ఏర్పడ్డ గోతులను పూడ్చివేయించి ప్రమాదాల నివారణకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ద్వారా డిజిటల్ మార్కెటింగ్ అసిస్టెంట్ కోర్సు శిక్షణకు ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన మంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన పథకం కింద మహారాణిపేటలోని నాక్ కేంద్రంలో ఉచిత శిక్షణ అందిస్తామని తెలిపారు. ఇంటర్ చదివి 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు గల అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణ కాలంలో మధ్యాహ్నం ఉచితంగా భోజన సదుపాయం కల్పిస్తామని, స్టేషనరీ అందజేస్తామని చెప్పారు. శిక్షణ అనంతరం ప్రభుత్వ సర్టిఫికెట్ జారీ చేసి, సంబంధిత రంగంలో ఉపాధి కల్పించనున్నారని, వివరాలకు 96761 70026, 798957 2891 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అర్ధరాత్రి సీపీ ఆకస్మిక తనిఖీలు

- బయటపడిన పోలీస్ స్టేషన్ల లోపాలు

తాటిచెట్లపాలెం: విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చేపట్టిన అర్ధరాత్రి తనిఖీల్లో పలు పోలీస్ స్టేషన్లలోని లోపాలు బయటపడ్డాయి. వివరాలిలా.. ఆదివారం అర్ధరాత్రి దాటాక ద్వారకా, ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్లను సీపీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఫోర్త్ టౌన్ పీఎస్‌లో విధులు నిర్వర్తించాల్సిన సెంట్రీ నిద్రపోవడాన్ని గుర్తించారు. ద్వారకా స్టేషన్ నిబంధనలకు విరుద్ధంగా తలుపులు మూసి ఉండటాన్ని గమనించారు. వెంటనే సిబ్బందికి మెమోలివ్వాలని సంబంధిత ఏసీపీలకు కమిషనర్ ఆదేశాలిచ్చినట్లు తెలిసింది.

పైప్‌లైన్ లీక్.. తాగునీరు వృథా




వడ్లపూడి లక్ష్మీపురం కాలనీలో వృథాగా పోతున్న మంచినీరు

కూర్మన్నపాలెం: మంచినీరు సరఫరా చేసే పైప్‌లైన్లకు పలు చోట్ల లీకులు ఏర్పడ్డాయి. వాటిని పూడ్చకపోవడంతో తాగునీరు కలుషితం కావడంతో పాటు రహదారులు బురదమయం అవుతున్నాయి. ఫలితంగా ప్రజలు నానాఅవస్థలు పడుతున్నారు. ప్రధానంగా 87వ వార్డులోని అనేక ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉంది. వడ్లపూడి లక్ష్మీపురంకాలనీలో పైప్‌లైనుకు లీకులు ఏర్పడి దాదాపు ఏడాదిన్నర కావస్తుందని అక్కడి వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల దృష్టికి ఈ సమస్యను ఎన్నిసార్లు తీసుకెళ్లినా ఫలితం దక్కడంలేదని కాలనీవాసులు వాపోయారు. చేపలమార్కెట్‌కు సమీపంలో పైపులైను లీకై మంచినీరు రోడ్డుపైనే వరదలా పారుతుందని పేర్కొన్నారు. దీనివల్ల కళాయిల ద్వారా వచ్చే మంచినీరు బురదగా మారి తాగడానికి కూడా వీలు లేకుండా పోతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. నీరు కలుషితం అవుతుండడం వల్ల ఎటువంటి రోగాలు సంభవిస్తాయోనని భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు లీకులపై దృష్టి పెట్టి వాటిని అరికట్టి స్వచ్ఛమైన మంచినీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతీయులు కోరుతున్నారు.

బాలోత్సవం పోటీలకు ఆహ్వానం

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సెప్టెంబర్ 13, 14 తేదీల్లో బాలోత్సవం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్, బాలోత్సవం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. ఉత్సవం సందర్భంగా పాఠశాలల విద్యార్థుల కోసం 45 రకాల సాంస్కృతిక, అకడమిక్ ఈవెంట్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బాలోత్సవం పోటీల్లో ఎన్ఏడీ కొత్త రోడ్, సింహాచలం, నరవ, గోపాలపట్నం, పెందుర్తి ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఆయా పోటీలు సీనియర్, జూనియర్ విభాగాల్లో జరుగుతాయన్నారు. పోటీలకు సంబంధించిన బ్రోచర్లు ప్రతి పాఠశాలకు అందిస్తామని, ఆసక్తి గల విద్యార్థులు సెప్టెంబర్ 6లోపు ఏయే అంశాల్లో పాల్గొంటారో వివరంగా అందించాలని సూచించారు. సెప్టెంబర్ 13, 14 తేదీల్లో జరగనున్న బాలోత్సవంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామన్నారు. జిల్లా బాలోత్సవం కార్యదర్శి జి.ఎస్.రాజేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక ప్రతినిధి శేషగిరిరావు, వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ ప్రతినిధులు రమాప్రభ, సతీష్, కళాశాల అధ్యాపకురాలు నాగమణి, బాలోత్సవం కమిటీ ప్రతినిధులు ఎస్వీ అప్పారావు, కె.నర్సింగరావు, శంకర్రావు, మహేష్, సతీష్ పాల్గొన్నారు.

300వ రోజుకు పోర్టు ఆస్పత్రి పరిరక్షణ దీక్షలు



పోర్టు హాస్పిటల్ వద్ద నిరసన దీక్ష చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణను ఆపాలని కైలాసపురం పోర్టు ఆస్పత్రి వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరసన దీక్షలు 300వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సోమవారం మానవ హారం నిర్వహించారు. అనంతరం సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు పద్మనాభరాజు మాట్లాడుతూ ఈ పోరాటం వల్ల గోల్డెన్ జూబిలీ హాస్పిటల్ టెండర్‌కు ఎవరూ రాలేదని, ఆస్పత్రి అభివృద్ధి కోసం చైర్మన్ కమిటీ వేశారన్నారు. పోర్టు హాస్పిటల్‌ను పోర్టు సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని, ఈ విషయంపై కూటమి ప్రభుత్వం స్పందించాలని కోరారు. సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం అనర్థమన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో కార్మికులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని ఆయన హెచ్చరించారు. దీక్షకు బీహెచ్‌ఈఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.టి.ప్రకాష్, డాక్‌యార్డ్ యూనియన్ నాయకుడు గణేష్ సంఘీభావం తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గాజువాక
9912222749, 9705347420, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com